
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చినా.. అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. తేమ శాతం, తరుగు పేరుతో కొనుగోలుదారులు సృష్టిస్తున్న ఇబ్బందులు ఒకవైపైతే , ఓపక్క ఆకాశం మబ్బులు పట్టి అకాల వర్షాల భయం వెంటాడుతుంటే, మరోపక్క కొనుగోలు కేంద్రాల వద్ద పోసిన ధాన్యం కుప్పలు ఎక్కడ తడిసి మురిగిపోతాయోనని రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ఐకేపీ, మహిళా సమాఖ్య కేంద్రాల నిరక్ష్యం, మిల్లర్ల మొండిచేయి, ప్రభుత్వాల పాలసీ వివాదాల నడుమ కొడంగల్ నియోజకవర్గంలో ధాన్యం సేకరణ నత్తనడకన సాగుతోంది. క్షేత్రస్థాయిలో అప్పాయిపల్లి ఐకేపీ కేంద్రం లాంటి చోట్ల కేవలం ఐదుగురు రైతులతోనే కొనుగోళ్లు ఆగిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అయితే, రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా వ్యాప్తంగా 27 లక్షల గన్నీ బ్యాగులు సిద్ధం చేసి, రవాణాకు ప్రత్యేక వాహనాలు కేటాయించి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని సివిల్ సప్లై అధికారులు భరోసా ఇస్తున్నారు.

# లక్ష్యానికి దూరంగా కొనుగోళ్లు



కొడంగల్, దౌల్తాబాద్ పరిధిలోని రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్న సివిల్ సప్లై డిటిలు మోహన్ కృష్ణ, గణపతి, సిఐ శ్రీధర్‌రెడ్డి

- అకాల వర్షాల భయంతో రైతుల గుండెల్లో రైళ్లు
- పడిగాపులు కాస్తున్న అన్నదాత
- అలంకారప్రాయంగా మారిన కొనుగోలు కేంద్రాలు
- కాటా వేసినా అందని సొమ్ము
- తేమ, తరుగు పేరుతో కొర్రీలు
- అప్పాయిపల్లి ఐకేపీ కేంద్రంలో దయనీయ స్థితి
- గన్నీ బ్యాగుల కొరత, అందని ట్రాక్ షీట్లు
- ఐదుగురు రైతులతోనే ఆగిపోయిన వైనం
- ధాన్యం బస్తాలు మునిగిపోయే ప్రమాదం
- ప్రభుత్వం వెంటనే స్పందించాలని అన్నదాతల డిమాండ్

**కొడంగల్, మే 17, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గ పరిధిలో ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. వరి కోతలు ప్రారంభమై నెల రోజులకు పైనే అవుతున్నా, నిర్దేశించుకున్న లక్ష్యంలో పావు వంతు అయినా సేకరించలేదు. ఒక పక్క ఆకాశం మబ్బులు పట్టి అకాల వర్షాల భయం వెంటాడుతుంటే, కేంద్రాల వద్ద కుప్పలుగా పోసిన ధాన్యం ఎక్కడ తడుస్తుందోనని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు, అధికారుల నిరక్ష్యం తోనే ఈ పరిస్థితి తలెత్తిందని, వానాకాలం నెత్తిమీదికొస్తున్నా తాము కొనుగోలు కేంద్రాల వద్దే పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మిల్లర్ల మొండిచేయి**

ప్రభుత్వాల మధ్య పాలసీ వివాదాల వల్ల కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం బస్తాలు మురిగిపోయేలా ఉన్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మిల్లర్లతో చర్చలు జరిపి కొనుగోళ్లను వేగవంతం చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే, ధాన్యం కాటా వేసిన రైతులకు డబ్బు చెల్లింపుల్లోనూ తీవ్ర ఆలస్యం చేస్తున్నారు. ధాన్యం అమ్మిన వారిలో సగం మంది రైతులకు కూడా ఖాతాల్లో డబ్బు జమ చేయకపోవడంతో విసుగెత్తిన చాలా మంది రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని కొడంగల్, దుద్యాల, దౌల్తాబాద్, బొంరాస్పేట్ మండలాల్లో మహిళా సమాఖ్య, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను గత కొన్ని రోజుల క్రితం ప్రారంభించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తుండడంతో విక్రయించేందుకు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా, ఓపక్క తేమ శాతం పేరుతో, మరోపక్క తరుగు పేరుతో కొనుగోలుదారులు ఇబ్బందులు సృష్టిస్తున్నారని పలువురు రైతులు తెలిపారు. దీనికి తోడు లారీల కొరత, గన్నీ బ్యాగుల కొరతతో రోజుల తరబడి కేంద్రాల దగ్గర వేచి చూడాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదే విషయమై మహిళా సమాఖ్య సభ్యుల దృష్టికి తీసుకువెళ్తే, ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేవని, కేవలం లారీల కొరత కారణంగానే జాప్యం జరుగుతుందని వారు వివరించారు.

**అప్పాయిపల్లిలో ఇప్పటి వరకూ ఐదుగురు నుంచే కొనుగోళ్లు**

మరోవైపు క్షేత్రస్థాయిలో ఐకేపీ కేంద్రాల పరిస్థితి పరిశీలిస్తే, కొనుగోళ్లు ఎంత నెమ్మదిగా సాగుతున్నాయో అర్థమవుతోంది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని ఐకేపీ అప్పాయిపల్లి కొనుగోలు కేంద్రం నివేదిక ప్రకారం.. శనివారం నాడు కేవలం ఇద్దరు రైతుల నుంచి 218 బస్తాల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. ఈ కేంద్రం ప్రారంభమైనప్పటి నుండి ఇప్పటివరకు కేవలం ఐదుగురు రైతుల నుంచి మాత్రమే మొత్తం 874 బస్తాల కొనుగోళ్లు జరిగాయి.

**కొత్త సంచుల జాడేది?**

రావలసిన గన్నీ సంచులలో కేవలం 5,000 పాత సంచులు మాత్రమే అందుబాటులో ఉండగా, కొత్త సంచుల జాడ లేదు. ఇక రవాణా విషయానికి వస్తే, శనివారం వరకు కేవలం ఒకే ఒక్క లారీ ద్వారా ముగ్గురు రైతులకు సంబంధించిన 660 బస్తాలను మాత్రమే మిల్లుకు తరలించగలిగారు. ఆన్లైన్ ప్రొక్యూర్మెంట్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో ఇప్పటివరకు ఇద్దరు రైతులకు చెందిన 364 బస్తాల వివరాలు మాత్రమే నమోదయ్యాయి.

**ఒక్క రైతుకూ జనరేట్ కాని ట్రాక్ షీట్**

అత్యంత విచారకరమైన విషయమేమిటంటే, ఇప్పటివరకు ఒక్క రైతుకు కూడా ట్రాక్ షీట్ జనరేట్ కాలేదు. అలాగే ఎలాంటి చెల్లింపులు కూడా ప్రారంభం కాలేదు.

**దిద్దుబాటు చర్యల్లో అధికార యంత్రాంగం**

ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందవద్దని అధికారులు భరోసా ఇస్తున్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు పౌర సరఫరా అధికారులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల్లో సివిల్ సప్లై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహిస్తున్నారని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బందులు పెట్టొద్దని సివిల్ సప్లై డీటీలు మోహన్ కృష్ణ, గణపతి, డీసీఓ నాగార్జున, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం వీరంతా కొడంగల్, దౌల్తాబాద్ మండలాల పరిధిలోని రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణ కోసం సుమారు 27 లక్షల గన్నీ బ్యాగులను సిద్ధం చేసినట్లు, అలాగే కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచామని తెలిపారు. ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక వాహనాన్ని ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందని, దీనివల్ల నింపిన బస్తాలను ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించే వీలుంటుందని వారు పేర్కొన్నారు. లారీల కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి తీసుకువస్తే వేగంగా కొనుగోళ్లు పూర్తి చేస్తామని, నాణ్యత ప్రమాణాలు పాటిస్తే కేవలం 40 కిలోలకు 600 గ్రాముల తూకం (తరుగు) మాత్రమే తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ధాన్యం సేకరించాలని మిల్లర్లను గట్టిగా ఆదేశించారు.



మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సాకేత్ విల్లా యజమానులు

# రెక్కల కష్టం తాకట్టు

**మేడ్చల్, మే 17 ప్రభాతవార్త:** రెక్కల కష్టాన్ని నమ్ముకుని, రూపాయి రూపాయి కూడబెట్టి... జీవితకాల పొదుపుతో సొంతింటి కలను నెరవేర్చుకున్నారు ఆ అమాయక కొనుగోలుదారులు. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్లు కూడా పూర్తయ్యాయి కదా, ఇక తమ ఆస్తికి ఢోకా లేదనుకుని సంబరపడ్డారు. కానీ, వారి నమ్మకాన్ని నట్టేట ముంచుతూ బిల్డర్లు ఆడిన 'కబ్జాకథ' ఇప్పుడు మేడ్చల్‌లో తీవ్ర సంచలనంగా మారింది. యజమానుల ప్రమేయం లేకుండా, వారికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా... ఇప్పటికే అమ్ముడైన విల్లాలను

- మధ్యతరగతి గుండెల్లో బిల్డర్ల సొంతింటి మంట!
- అమ్ముడైన ఇళ్లను తాకట్టు పెట్టి కోట్ల రూపాయల దందా
- 'అన్‌సోల్డ్'గా చూపించి భారీ మోసం
- యజమానుల కళ్లు గప్పి విస్తా ఐటీసీఎల్‌తో కలిసి డైరెక్టర్ల మాయాజాలం
- సాకేత్ నమ్మకద్రోహంపై మేడ్చల్‌లో విల్లా యజమానుల సమరభేరి!
- బాధితుల ఫిర్యాదుతో కదిలిన పోలీసులు

అక్రమంగా తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు నొక్కేసిన ఘరానా మోసం వెలుగుచూసింది.

అమ్ముడైన ఇళ్లను 'అన్‌సోల్డ్' అని చూపించి..

గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధి గౌడవెల్లిలోని సాకేత్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై విల్లా యజమానులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ సంస్థ గౌడవెల్లిలో ఒక భారీ విల్లా ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. అందులో పలువురు కొనుగోలుదారులు చట్టబద్ధంగా విల్లాలను రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారు. అయితే, సంస్థ డైరెక్టర్లు రాధాకృష్ణ, రవిల కన్ను ఈ రిజిస్టర్డ్ ఆస్తులపై పడింది. బాధితుల ఆరోపణల ప్రకారం... విస్తా ఐటీసీఎల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో చేతులు కలిపిన ఈ డైరెక్టర్లు, ఇప్పటికే విక్రయించిన విల్లాలు, ఖాళీ స్థలాలను 'అన్‌సోల్డ్' (ఇంకా అమ్ముడుపోని ఆస్తులు)గా చూపిస్తూ తప్పుడు పత్రాలతో భారీ మొత్తంలో నిధులు సమీకరించారు. తమ పేరిట ఉన్న ఆస్తులపై తమకు తెలియకుండానే కోట్ల రూపాయల రుణాలు పొందినట్లు తెలుసుకున్న యజమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. "రూపాయి రూపాయి కూడబెట్టి, జీవితకాల కష్టార్జితంతో సొంతింటి కలను నెరవేర్చుకున్నాం. చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయిన ఇళ్లపై మాకు తెలియకుండా లోన్లు తీసుకోవడం దారుణం. ఈ మోసం వల్ల మా కుటుంబాల భవిష్యత్తు అనిశ్చితిలో పడింది" అంటూ బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు.

రోడ్డెక్కిన విల్లా యజమానులు

ఈ భారీ కుంభకోణం బయటపడటంతో విల్లా యజమానుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఆదివారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో విల్లా యజమానులు ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మోసానికి పాల్పడిన సాకేత్ ఇంజనీర్స్ డైరెక్టర్లపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి, వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తమ ఆస్తులను ఈ అక్రమ తాకట్టు నుంచి తక్షణమే విముక్తి కల్పించాలని, ఇంతటి దారుణమైన మోసానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మధ్యతరగతి ప్రజల నమ్మకాన్ని, జీవితకాల కష్టాన్ని తాకట్టు పెట్టిన ఈ కేటుగాళ్ల వ్యవహారంపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్‌చేస్తున్నాయి.



దరఖాస్తులు స్వీకరిస్తున్న మహిళా శక్తి మై వాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి

# విన్నపాలు వినవలే..

## మీ సమస్యా-మా పరిష్కారానికి విశేష స్పందన

**శామీర్‌పేట, మే 17, ప్రభాతవార్త :** మందాయిపల్లి గ్రామంలో మీ సమస్యా-మా పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్ (మండల్) పరిధిలోని మందాయిపల్లి గ్రామంలో మహిళా శక్తి మై వాయిస్ సంఘం ఆధ్వర్యంలో మీ సమస్యా-మా పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు గ్రామ ప్రజలు విచ్చేసి తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేశారు. మహిళా శక్తి మైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, బిజెపి రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి ఆధ్వర్యం వహించారు. గ్రామంలో ఉన్న సమస్యలతో పాటు పలువురు వ్యక్తిగత సమస్యలను కూడ తెలియజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం కూడ పలువురు విన్నవించారు. మందాయిపల్లి గ్రామంలో ప్రధానంగ ఉన్న రోడ్ల, డ్రైనేజీ సమస్యలు, దోమల బెడద, వీధి కుక్కల స్వైర విహారం వంటి సమస్యల పరిష్కారం కోసం ధరఖాస్తులు చేశారని, వాటితో పాటు పలువురు ప్రభుత్వ పింఛన్ల కోసం వృద్ధులు, మహిళలు దరఖాస్తులు కూడ చేశారని, కొందరు కుటుంబ సమస్యలను విన్నవించారని, దీనిలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకవెళ్లటం జరుగుతుందని అన్నారు. ఆ తరువాత ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కోసం 130 మంది నుంచి దరఖాస్తులను స్వీకరించటం జరిగిందని ఆ సంఘం అధ్యక్షురాలు ఎన్.హైమారెడ్డి తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజలకు ఉచితంగా ప్రధాన మంత్రి సురక్ష భీమా (పిఎంఎస్‌బివై) పథకంను మహిళా శక్తి మైవాయిన్ సంఘం ద్వారా చేయించటం జరుగుతుందని ఆమె వివరించారు. దీనిలో గ్రామానికి చెందిన మహిళలు, పలువురు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో 474 డ్రంకెన్ డ్రైవ్ కేసులు

**హైదరాబాద్, మే 17,ప్రభాతవార్త:** మద్యం తాగి వాహనం నడపడం చాలా ప్రమాదకరమైన చర్య. మన మస్తిష్కాన్ని, నాడీ వ్యవస్థను క్రమం గా ప్రభావితం చేస్తుంది. ఇదిమన అవగాహనను తగ్గించి, మనం తీసుకునే నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. అందుకే మద్యం తాగి వాహ నాన్ని నడపవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ కొందరు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. హైదరా బాద్ ట్రాఫిక్ పోలీసులు గత రెండు రోజుల పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ మొత్తం 474 మంది డ్రైవర్లు పట్టుబడ్డారని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిలో 417 మంది ద్విచక్ర వాహనదారులు (టూవీలర్స్), 24 మంది త్రీవీలర్ల నిర్వాహ కులు, అలాగే 33 మంది ఫోర్‌వీలర్లు మరియు ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. తనిఖీల సమయంలో నమోదైన బ్రీత్ అనలైజర్ స్థాయిల వివరాలు 30 నుంచి 50 103 కేసులు, 51 నుంచి 100 188 కేసులు,101 - 150 100 కేసులు, 151- 200 44 కేసులు, 201- 250 19 కేసులు, 251 -300 8 కేసులు 300 అంతకంటే ఎక్కువ 12 కేసులు నమోదైనట్లు తెలిపారు.

# కూలీపై కత్తులతో దాడి

## గొంతు కోసి దుండగుల పరారీ- అక్రమ సంబంధమే కారణమని అనుమానం

**షాద్‌నగర్, మే 17, ప్రభాతవార్త:** షాద్‌నగర్ పట్టణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ఓ కూలీపై కత్తులతో దాడి చేసి, విచక్షణా రహితంగా పొడిచి, గొంతు కోసి అక్కడి నుంచి పరార య్యారు. తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కుప్పకూలిన బాధితుడిని స్థానికులు వెంటనే షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆయన పరిస్థితి విష మంగా ఉండటంతో, అనంతరం ప్రథమ చికిత్స తర్వాత హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. చౌదరగూడ మండలం పెద్ద ఎలికిచర్ల గ్రామానికి చెందిన జయరాం గత కొన్నేళ్లుగా షాద్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కులి పనులు చేసుకుంటూ భార్య, పిల్లలను పోషిస్తున్నాడు. ఆదివారం తెల్లవారుజామున పట్టణంలోని శివరాం నాయక్ ఆసుపత్రి సమీపంలో ఉండగా... ఇద్దరు వ్యక్తులు అక్కడికి చేరుకుని అకస్మాత్తుగా ఆయనపై కత్తులతో దాడి చేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. పట్టణంలో నడిబొడ్డున జరిగిన ఈ దారుణ ఘటన స్థానికుల్లో తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ఈ దాడి అక్రమ సంబంధం నేపథ్యంలోనే జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అసలు ఇది పాత కక్షలా..? వ్యక్తిగత విభేదాలా..? లేక అక్రమ సంబంధం నేపథ్యంలోనే ఈ గొడవ జరిగిందా..? లేదా మరేదైనా కారణం ఉందా..? అనే పలు కోణాల్లో పోలీసులు ప్రస్తుతం తీవ్రంగా విచారణ చేపట్టారు.



దాడిలో గాయపడ్డ జయరాం

# ఉప్పల్‌లో ట్రాఫిక్ దారి మళ్లింపు

## వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు

**ఉప్పల్, మే 17 ప్రభాతవార్త :** ఉప్పల్ చౌరస్తా లో ఆదివారం నుంచి ట్రాఫిక్ దారిమళ్లింపు చేపట్టడంతో వాహనదారుల తీవ్ర ఇక్కట్లు పడ్డారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గత నెల రోజుల నుంచి ట్రాఫిక్ దారి మళ్లింపు ఉంటుందని ప్రకటించినా ప్రత్యామ్నాయ రహదా రులు పూర్తి స్థాయిలో తీర్చిదిద్దకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వరంగల్ జాతీయ రహదారి మూసివేయడంతో కాలనీ రోడ్లు, చిన్న చిన్న గల్లీల వెంట ఆర్టీసీ బస్సులు, లారీలు ప్రయాణించాయి. దీంతో పలువురు కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు రోడ్డు మూసివేస్తామని గత నెల రోజుల నుంచి ప్రకటిస్తున్నా ప్రయత్నామ రహదారులను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దలేదు. దీంతో దూర ప్రాంత ప్రయాణికులు అవస్థలకు గురైయ్యారు. ఉప్పల్ చౌరస్తా వద్ద పూర్తి స్థాయిలో మూసివేయగా, వరంగల్ నుంచి వచ్చే ప్రయాణికులు చౌరస్తా వరకు వచ్చి వెంకటేశ్వర కాలనీ మీదుగా నాగోల్ వైపు వెళ్లారు. ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా వద్ద రోడ్డును పూర్తిగా మూసివేశారు. దీంతో కాలనీల నుంచి వచ్చే వాహనదారులు సుమారు కిలో మీటరు దూరం తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉప్పల్‌లో చాలా రహదారుల వద్ద వాహనదారుల ఇష్టారాజ్యంగా ప్రయాణించడంతో ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర అవస్థలుపడ్డారు. వాహనదారులు కూడా పోలీ సులు సూచనలు పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వాహనాలను రహదారుపైకి తీసుకుని వచ్చారు. పలు కాలనీల మీదుగా బోర్డులు ఏర్పాటు చేసినా పట్టించుకోకుండా రహదారిపైకి రావడంతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. పలు చోట్ల చౌరస్తాలపై పోలీసు లను నియమించినా వారి సూచనలు చాలా మంది బేఖాతరు చేశారు. ఎక్కడ పడితే అక్కడ రోడ్ల వెంట వాహనాలు నిలిచిపోయి కనిపించాయి.

**ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే...**

వరంగల్ నుండి హైదరాబాద్ వెళ్లే వాహనదా రులు మే ఫీల్ హోటల్ దాటిన తర్వాత ఉప్పల్ భగాయత్ ద్వారా నాగోల్ వెళ్లి, సర్వీస్ రోడ్డు ద్వారా వెళ్లి ఫ్లైఓవర్ కింద యూ టర్న్ తీసుకొని హైదరాబాద్ వెళ్లాల్సి ఉంటుంది. హైదరాబాదు నుండి వరంగల్ వెళ్లే వాహనదారులు సర్వే ఆఫ్ ఇండియా జంక్షన్ వద్ద పిస్తా హౌస్ పక్క నుండి బీరప్ప గడ్డ మీదుగా వెళ్లి జాతీయ రహదారి 163 మీదుగా వరంగల్‌కు వెళ్లాల్సి ఉంటుంది.



పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

# ఘనంగా బొడ్రాయి పండుగ

**ఘట్‌కేసర్, మే 17, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో ఆదివారం బొడ్రాయి పండుగ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం మహిళలు వేపాకులు, నీటితో బొడ్రాయికి అభిషేకం చేశారు. అర్ధరాత్రి 1 గంటకు మైలలు తీసే కార్యక్రమం, 3 గంటలకు బలిగంప కార్యక్రమం, ఉదయం 5 గంటలకు బొడ్రాయికి పంచామృత అభిషేకం నిర్వహించారు. బొడ్రాయి ప్రాంగణాన్ని వివిధ రకాల పూలతో అలంకరించగా పరిసర వీధులను విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, సిఎంఆర్ హెల్త్‌సిటి చైర్మన్ డాక్టర్ చామకూర భద్రారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు విచ్చేసి బొడ్రాయికి అభిషేకం చేసి పూలతో పూజించారు. పసుపు, కుంకుమ, వేపాకులతో బోనాలను తయారుచేసి ఊరేగింపుగా తీసుకువచ్చి నైవేద్యం సమర్పించారు. రెండు సంవత్సరాలు కావడంతో స్థానికులు బంధువులను ఆహ్వానించుకొని పండుగ చేసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. బొడ్రాయి కమిటీ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేసి పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి విచ్చేసిన నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈసందర్భంగా పట్టణంలో పలుచోట్ల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో బొడ్రాయి కమిటీ అధ్యక్షులు ఎర్రోళ్ల సత్యనారాయణ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్లు పలుగుల మాధవరెడ్డి, నానావత్ రెడ్డియానాయక్, మాజీ ఉపసర్పంచ్ రాజబోయిన యాదగిరియాదవ్, సొసైటీ మాజీ చైర్మన్లు సార శ్రీనివాస్‌గౌడ్, డొంకెన బిక్షపతిగౌడ్, జేఏసీ కన్వీనర్ మారం లక్ష్మారెడ్డి, మాజీ ఎంపిటిసిలు మేకల నర్సింగ్‌రావు, నాగులపల్లి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

